జలమండలి కార్యాలయంలో ఆరు ఫిర్యాదులు

చింతల్: సురక్షిత నీటి సరఫరాతో పాటు డ్రైనేజీ సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని కుత్బుల్లాపూర్ జలమండలి జీఎం అశోక్ అన్నారు. సోమవారం రంగారెడ్డి నగర్ డివిజన్ ఏపీహెచ్‌బీ కాలనీలోని జలమండలి కార్యాలయంలో ప్రజావాణి జరిగింది. తాగునీరు సరఫరా రావడం లేదని, డ్రైనేజీ పొంగిపొర్లుతోందని, స్టాటిక్ ట్యాంక్‌ల ద్వారా నీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆరు వినతి పత్రాలు అందాయి. వాటిని స్వీకరించిన అశోక్ పరిష్కరించాల్సిందిగా సంబంధిత సెక్షన్ల మేనేజర్లను ఆదేశించారు.

నేడు కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం

కుత్బుల్లాపూర్: బహదూర్‌పల్లిలోని మేకల వెంకటేశం ఫంక్షన్ హాల్‌లో మంగళవారం కాంగ్రెస్ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఉంటుందని నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 9.30 గంటలకు జరిగే ఈ సమావేశానికి మేడ్చల్ జిల్లా కో ఆర్డినేటర్ పారిజాత నరసింహారెడ్డి, జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి హాజరు కానున్నారని తెలిపారు. ప్రజాప్రతినిధులు, బ్లాక్‌ల అధ్యక్షులు, మైనార్టీ, ఎస్సీ, ఎస్టీ సెల్ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, మహిళా నాయకులు పాల్గొనాలని కోరారు.

అనుమతులు ఒకలా.. నిర్మాణాలు మరోలా!



చంద్రనగర్ పాత భవనంపై అదనపు అంతస్తులు వేస్తున్న దృశ్యం

చింతల్: సాధారణ భవనాలకు అనుమతులు తీసుకొని కమర్షియల్ భవనాలు నిర్మిస్తున్నారు. ఇంత జరుగుతున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చింతల్ డివిజన్ చంద్రనగర్, చింతల్‌లో అక్రమణ నిర్మాణాలు రోజురోజుకు ఎక్కువవుతున్నాయి. చంద్రనగర్‌లో గతంలో సాధారణ భవన నిర్మాణానికి అనుమతులు తీసుకొని కమర్షియల్ భవనం నిర్మించారు. మరలా ఇటీవల అదే పాత భవనంపై అదనంగా మరో ఫ్లోర్‌తో పాటు పెంట్ హౌస్ నిర్వహిస్తున్నప్పటికీ అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా చింతల్‌లో సాధారణ భవనానికి పర్మిషన్ తీసుకొని రెండు షెట్టర్లతో రెండు అంతస్తులతో మరో భవనం ఇటీవలే పూర్తికా వచ్చింది. ఈ భవనానికి కూడా సాధారణ అనుమతులకు తీసుకొని కమర్షియల్ నిర్మించినప్పటికీ అధికారులు పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ ఆదాయానికి భారీగానే గండిపడుతుంది. అధికారులు స్పందించి అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకొని ప్రభుత్వానికి ఆదాయం సమకూరేలా యత్నించాలని పలువురు స్థానికులు కోరుతున్నారు.

కమిటీహాల్ నిర్మాణం పూర్తయ్యేనా?

- నిధులు లేక నిలిచిన పనులు
- బేస్‌మెంట్, పిల్లర్లకే పరిమితమైన కమిటీహాల్ నిర్మాణం
- రెండేళ్లు గడుస్తున్నా పట్టించుకోని అధికారులు
- చెత్త డంపింగ్ కేంద్రంగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం

నిధుల లేమితో ఇందిరాగాంధీ నగర్ కమిటీహాల్ భవన నిర్మాణ పనులు నిలిచిపోయాయి. 60 గజాల స్థలంలో కమిటీహాల్ భవనాన్ని ఏర్పాటు చేసేందుకు 2022లో రూ.18 లక్షల నిధులతో పనులు ప్రారంభించారు. అనంతరం నిధులు సరిపోవని కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. పనులు ప్రారంభించడంతో త్వరలోనే భవనం అందుబాటులోకి వస్తుందని ఆశించిన కాలనీ ప్రజలకు నిరాశ తప్పలేదు. పనులు నిలిచిపోవడంతో ఆ ప్రాంతం చెత్తడంపింగ్ కేంద్రంగా, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా అధికారులు భవనం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



బేస్‌మెంట్, పిల్లర్ల వద్ద నిలిచిన పనులు



కమిటీహాల్ నిర్మాణ స్థలంలో మద్యం బాటిళ్లు, చెత్త వ్యర్థాలు

రంగారెడ్డినగర్: స్థానికంగా నెలకొన్న సమస్యలపై చర్చించుకునేందుకు, ఇతర సమావేశాలు, కార్యక్రమాలు చేపట్టేందుకు ఆ బస్తీ వాసులకు కమిటీ భవనం అందుబాటులో లేకుండా పోయింది. బస్తీ ఏర్పడి రెండు దశాబ్దాలు కావస్తున్నా నేటికి కమిటీ హాల్‌కు నోచుకోలేకపోతున్నామని బస్తీ వాసులు వాపోతున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని ఇందిరాగాంధీనగర్ బస్తీలో 60 గజాల స్థలంలో కమిటీ భవనాన్ని ఏర్పాటుకు 2022లో రూ.18 లక్షల జీహెచ్‌ఎంసీ నిధులను మంజూరు చేశారు. సదరు పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ బేస్‌మెంట్, పిల్లర్లు, బోరు ఏర్పాటు చేసి తదనంతరం నిధులు సరిపోవంటూ పత్తా లేకుండా పోయాడు. దీంతో పలుమార్లు బస్తీ సంక్షేమ సంఘం సభ్యులు అధికారులు చుట్టూ తిరిగినా అదిగో చేపడతాం.. ఇదిగో నిధులు విడుదల చేస్తున్నామంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప కమిటీహాల్ నిర్మాణం మాత్రం ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది..

ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ..

కమిటీ హాలు కోసం తెచ్చిన కిటికీలు, తలుపులు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తూ శిథిలావస్థకు చేరాయి. దీంతో జీహెచ్‌ఎంసీ అధికారులు వెచ్చించిన వేలాది రూపాయలు బూడిదలో పోసిన పన్నీరుగా మారాయి. చెక్క కిటికీలు, తలుపులు చెదలు పడుతున్నాయని, అవి భవనానికి పనికి రావని స్థానికులు పేర్కొంటున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా..

కమిటీహాల్ నిర్మాణం బేస్‌మెంట్‌తో నిలిచిపోవడంతో రాత్రి వేళల్లో కొందరు వ్యక్తులు మద్యం సేవించడానికి అడ్డాగా మార్చుకున్నారు. మద్యం మత్తులో అటుగా రాకపోకలు సాగించే వారి పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. దీంతో రాత్రైందంటే చాలు బస్తీ మహిళలు బయటకు వచ్చేందుకు జంకుతున్నారు.

చెత్తకు డంపింగ్ కేంద్రంగా..

రెండేళ్లుగా ఖాళీగా ఉండటంతో కమిటీ భవనం స్థలంలో, బోరునీటి సంపు కోసం తవ్విన గుంత ప్రాంతంలో చుట్టు పక్కల ఇళ్ల వాసులు చెత్తను పారబోస్తున్నారు. రోజుల తరబడి చెత్త వ్యర్థాలు అలాగే ఉండటంతో కుళ్లి దుర్వాసన వస్తోంది. దీంతో అనారోగ్యాల బారిన పడుతున్నారు. అయినా అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు.



పాడవుతున్న కిటికీలు, తలుపులు

> **అధికారుల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా..**
>
> మా ప్రాంతానికి కమిటీ భవనం ఏర్పాటు చేస్తారని సంతోష పడ్డాం. పనులు చేపట్టిన కాంట్రాక్టర్ నిధుల సరిపోవంటూ పునాదులు, పిల్లర్లతోనే నిలిపివేశాడు. అధికారుల చుట్టూ రెండేళ్లుగా తిరుగుతున్నా ఇదిగో.. అదిగో.. అంటూ కాలయాపన చేస్తున్నారు. ఇటీవల ఉప కమిషనర్ నరసింహా సార్‌ను కలిస్తే నిధులు మంజూరయ్యాయి, త్వరలోనే ప్రారంభిస్తామని చెప్పారు. ఈసారైనా కమిటీ భవనాన్ని పూర్తి చేస్తారో? లేదో?.
>
> – నగేష్ యాదవ్, ఇందిరాగాంధీ నగర్



సనాతనధర్మ రక్షణ దళం ఏర్పాటు అనివార్యం



దీపాలతో సేవా సంఘం సభ్యులు

సుభాష్‌నగర్: పహల్గాం ఉగ్రదాడిని ఖండిస్తూ సోమవారం శ్రీ గాయత్రి బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం సూరారంలోని వాసుదేవాశ్రమంలో దీపాలను ప్రదర్శిస్తూ శాంతియుత నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు గోగులపాటి కృష్ణమోహన్ మాట్లాడుతూ.. దేశంలో ఉద్రిక్త పరిస్థితులను సృష్టించేందుకే హిందూ యాత్రికులను ఉద్దేశపూర్వకంగా లక్ష్యంగా చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అన్ని ఆలయాల్లో ప్రతిరోజు సాయంత్రం పిల్లలు, పెద్దలు పాల్గొనేలా భజన, కోలాటం లాంటి కార్యక్రమాలు చేపట్టాలని, సనాతన ధర్మ రక్షణ దళం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో కార్యక్రమంలో సంఘం ముఖ్య సలహాదారుడు సర్వేపల్లి రమేష్ కుమార్, సుబ్రహ్మణ్యం స్వామి, హరి రాఘవేంద్ర, గీతా శ్రీధరాచార్యులు, రాచపూడి ప్రభాకర్, హనుమంతరాయ శర్మ, గురజాడ రంగారావు, హైమ శివభాస్కర్, రేఖాజ్యోతి, లక్ష్మీ కుమారి, సుబ్బలక్ష్మి, సూర్యసుందరి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ.. నిర్మాణాల తొలగింపు



దుండిగల్: రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా ఉన్న నిర్మాణాలను అధికారులు తొలగిస్తున్నారు. భౌరంపేట నుంచి బాచుపల్లి చౌరస్తా వరకు 100 ఫీట్ల రోడ్డు వెడల్పు జరుగుతున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మల్లంపేటలోని పోచమ్మ గుడి నుంచి బస్టాప్ వరకు రోడ్డుకు ఇరు వైపులా ఉన్న నిర్మాణాలను జేసీబీతో తొలగించారు. టిఫిన్ సెంటర్లు, చిన్న పాటి దుకాణాలను మున్సిపల్, ట్రాఫిక్ పోలీసులు తొలగించారు.

పహల్గాం మృతులకు ఘన నివాళి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌టీఆర్ నగర్ సంక్షేమ సంఘం సభ్యులు

నిజాంపేట్ : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్‌లో సోమవారం పహల్గాం మృతులకు ఘన నివాళులర్పించారు. ఉగ్రవాదాన్ని అంతం చేయాలని ప్రభుత్వాలను కోరారు. కార్యక్రమంలో ఏనుగుల శ్రీనివాస్‌రెడ్డి, ఏనుగుల శ్రీకాంత్‌రెడ్డి శ్రీహర్ష ఆమంచి, అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డిపల్లి సుధాకర్, బూసాల ఉదయ్ కుమార్, బైపునేని మోహన్, ప్రవీణ్‌చారి, మధుసూదన్‌రెడ్డి, రవీందర్, నాగిరెడ్డి, కాంతరెడ్డి, నరసింహ, ఉపేందర్, ప్రభాకర్, ప్రశాంత్, అశోక్ రెడ్డి, డి.మంజునాథ్, వినయ్, జగన్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం


- బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్
- ఇండోర్ షటిల్ కోర్టు ప్రారంభం



షటిల్ ఆడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని బీఆర్‌ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ ఎస్.ఆర్. నాయక్‌లో రూ. 2.90 కోట్ల నిధులతో నిర్మించిన ఇండోర్ షటిల్ కోర్టు క్రీడా ప్రాంగణాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత సమాజంలో పిల్లలు ఫోన్లకు పరిమితమై క్రీడలకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. క్రీడల్లో రాణించి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు తీసుకురావాలని కోరారు. తల్లిదండ్రులు సైతం తమ పిల్లలను షటిల్ ఆడేలా ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, నాయకులు లక్ష్మీనారాయణ, శేషాచారి, దుర్గారావు, హరిబాబు యాదవ్, నర్సింగ్‌రావు, శ్యామ్, పద్మ, అనిల్, శ్రీదేవి, సరిత, ఎస్.ఆర్.నాయక్ సంక్షేమ సంఘం అధ్యక్షులు శ్రీనివాస్, కార్యవర్గ సభ్యులు సదానందచారి, ప్రభాకర్, భాస్కర్ రెడ్డి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణిలో 18 ఫిర్యాదులు



ఉప కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న గణేశ్‌నగర్ సంక్షేమ సంఘం ప్రతినిధులు

కుత్బుల్లాపూర్ : జంట సర్కిళ్ల పరిధిలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 18 ఫిర్యాదులు వచ్చాయి. కుత్బుల్లాపూర్ ఉప కమిషనర్ నరసింహ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తొమ్మిది ఫిర్యాదులు రాగా వాటిలో రెండు టౌన్ ప్లానింగ్, 6 ఇంజినీరింగ్, ఒకటి వెటర్నరీపై ఫిర్యాదులు వచ్చాయి. అదేవిధంగా గాజులరామారం సర్కిల్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణిలో ఉప కమిషనర్ మల్లారెడ్డి అధ్యక్షతన మొత్తం 9 ఫిర్యాదులు వచ్చాయి. 3 టౌన్ ప్లానింగ్, 4 ఇంజినీరింగ్, 1 ఎలక్ట్రిసిటీ మరొకటి రెవెన్యూ విభాగానికి ఫిర్యాదులు వచ్చాయి. వీటిని సంబంధిత అధికారులకు పంపి వచ్చే వారంలోగా ఫిర్యాదులను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామని ఉప కమిషనర్లు పేర్కొన్నారు. గణేష్ నగర్ నాలాలోని చెత్తను తొలగించాలని కోరగా.. సర్కిల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ లక్ష్మీగణేష్ వారం రోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా వైష్ణవి కాలనీలో రోడ్డు నెంబర్ 5 సిమెంట్ రోడ్డు విషయంపై స్థానిక సంక్షేమ సంఘం ప్రతినిధులు వినతిపత్రం అందజేశారు. ప్రణాళికలు రూపొందించి తప్పకుండా పనులు పూర్తి చేస్తామని అధికారులు హామీ ఇచ్చారు.

వీఎన్‌ఆర్ వీజేఐటీలో ముగిసిన శిక్షణ



అతిథుల చేతుల మీదుగా సర్టిఫికెట్స్ అందుకున్న విద్యార్థులు

నిజాంపేట్: రహదారుల మౌలిక సదుపాయాల ప్రాజెక్టులలో జియోసింథెటిక్స్ వినియోగం పేరిట 5 రోజుల పాటు జరిగిన నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం వీఎన్‌ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలలో సోమవారం విజయవంతంగా ముగిసింది. న్యూఢిల్లీలోని సెంట్రల్ రోడ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, భారత ప్రభుత్వ వస్త్ర మంత్రిత్వ శాఖలోని నేషనల్ టెక్నికల్ టెక్స్‌టైల్ మిషన్ ఆధ్వర్యంలో శిక్షణ కొనసాగింది. శిక్షణలో 118 మంది బీటెక్, సివిల్ ఇంజినీరింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. సీఎస్‌ఐఆర్, సీఆర్‌ఆర్‌ఐ నుంచి ప్రముఖ శాస్త్రవేత్తలు, ఐఐటీ హైదరాబాద్, ఎన్ఐటీ వరంగల్, ఇతర ప్రఖ్యాత విద్యాసంస్థల నుంచి అధ్యాపకులు, జియోటెక్స్‌టైల్స్ పరిశ్రమ నిపుణులు హాజరై అనుభవాలను వివరించారు. కార్యక్రమంలో ముఖ్య సమన్వయకర్త, సివిల్ ఇంజినీరింగ్ విభాగాధిపతి ఆచార్య డా.కె.రామూజీ, సమన్వయకర్త ప్రొఫెసర్ డా.ఏ.రమేష్, కళాశాల సంచాలకులు డా.బి.చెన్నకేశవరావు, కళాశాల ప్రిన్సిపాల్ డా.సి.డి. నాయుడు, విజ్ఞానజ్యోతి సంస్థ ప్రధాన కార్యదర్శి కోడె దుర్గాప్రసాద్, డా.కె.రవీందర్, డా.జి.భరత్, డా.పీఎస్.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నందాఫుడ్స్ పరిశ్రమపై చర్యలు తీసుకోవాలి



ఫిర్యాదు స్వీకరిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి

రంగారెడ్డినగర్: ఈపీఎఫ్ నగదును జమ చేయకుండా మోసానికి పాల్పడిన రంగారెడ్డినగర్‌లోని నందా ఫుడ్స్ పరిశ్రమ యాజమాన్యంపై కార్మికులు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జిషాన్ అహ్మద్‌కు ఫిర్యాదు చేశారు. కార్మికుల నుండి అందిన ఫిర్యాదులతో సోమవారం నందా ఫుడ్స్ కంపెనీలో ఉమ్మడి జన సమన్వయ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ తైలం శ్రీనివాస్, నాగరాజ్ మాట్లాడుతూ.. 20 సంవత్సరాలుగా కార్మికుల జీతాల నుంచి ఈపీఎఫ్ కట్ చేస్తున్న యాజమాన్యం సదరు మొత్తాన్ని పక్కదారి పట్టించిందని ఆరోపించారు. కార్మికులకు ఎలాంటి పీఎఫ్ స్లిప్‌లు ఇవ్వకపోవడంతో కంపెనీ చుట్టూ తిరుగుతున్నారని, పరిశ్రమ యాజమాన్యంపై చర్యలు తీసుకుని కార్మికుల న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నాయకులు ఎల్లయ్య కాక, బాలకృష్ణ, గురువారెడ్డి, శ్యామ్, ఈఎస్ఐ, పీఎఫ్ అధికారులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుల జీతాలు చెల్లించాలి

సీపీఐ, బీజేపీ నాయకుల ధర్నా



ధర్నాలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

నిజాంపేట్ : మున్సిపల్ కార్మికుల పెండింగ్ జీతాలు చెల్లించాలని సీపీఐ, బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. తెల్లవారుజాము నుంచి విధుల్లో చేరే కార్మికుల పట్ల ప్రభుత్వానికి, అధికారులకు ఇంత చిన్నచూపు ఏంటని ప్రశ్నించారు. వెంటనే కార్మికులకు జీతాలు చెల్లించాలని, లేని పక్షంలో కార్మికుల పక్షాన పోరాటం కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో బాచుపల్లి మండల అధ్యక్షులు ప్రసాద్ రాజు, పార్లమెంట్ మీడియా సెల్ కన్వీనర్ సుమన్ రావు, ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దాసి నాగరాజు, కార్యవర్గ సభ్యులు గజెల్లి సంతోష్ కుమార్, సీపీఐ నాయకులు యేసురత్నం, శ్రీనివాస్, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు.. ఎండుతున్న మొక్కలు !

- పల్లె, పట్టణ ప్రకృతి వనాలకు సంరక్షణ కరువు
- లక్షల్లో మొక్కలు నాటుతున్నా పెంచడంలో అశ్రద్ధ
- అటవీ, పంచాయతీ, పురశాఖలు నిర్లక్ష్యం వీడాలంటున్న ప్రజలు

మండుతున్న ఎండల నేపథ్యంలో మొక్కల సంరక్షణపై అటవీ, పంచాయతీ శాఖలు, పురపాలక సంఘాలు ప్రత్యేక చర్యలు తీసుకోకపోవడంతో నాటిన మొక్కలు వాడిపోతున్నాయి. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న వనమహోత్సవ లక్ష్యం నీరుగారకముందే.. మొక్కల సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

సాక్షి,సిటీబ్యూరో: పంచాయతీలు, పురపాలక సంఘాల్లో ప్రజలు ఎన్నుకున్న పాలకవర్గాలు లేకపోవడంతో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతోంది. స్పెషల్ ఆఫీసర్లు మొక్కల సంరక్షణపై ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో సిబ్బంది వాటి అలనా, పాలనా చూడటంలేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

- మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో హరితహారం, వనమహోత్సవాల్లో భాగంగా ఇప్పటి వరకు రూ.5.50 కోట్ల మొక్కలు నాటారు. అధికారిక లెక్కల్లో జియో ట్యాగింగ్ రూపంలో వాటి లెక్కలు కనపడుతున్నాయి తప్పా.. క్షేత్రస్థాయిలో పరిస్థితి భిన్నంగా ఉంది. మొక్కలు నాటేటప్పుడు ఉంటున్న పర్యవేక్షణ.. సంరక్షణ చర్యల్లో కనిపించడం లేదు. నర్సరీల నిర్వహణకు రూ. లక్షల్లో వ్యయం చేసి మొక్కలు పెంచి, వాటిని సంరక్షించకుండా వదిలేయడం ద్వారా ప్రజాధనం వృథా అవుతోందనే విమర్శలున్నాయి.



మొక్కల పెంపకానికి....

నర్సరీలో మొక్కల పెంపకానికి కూలీకి రూ. 257లు రోజువారీగా చెల్లిస్తున్నారు. మట్టిని కవర్లలో నింపి విత్తనాలు విత్తేందుకు దాదాపు రూ.1.20 చెల్లిస్తున్నారు. ఒక్కో మొక్క నాటేందుకు, పాదులు తీసేందుకు రూ.37 వరకు చెల్లిస్తున్నారు. రక్షణ కంచెకు రూ.6 వరకు, నీరు పోసేందుకు రూ.3 చెల్లిస్తున్నారు. ఇంత వ్యయం చేసి మొక్కను బతికించుకోకుంటే నిధులు వృథా అవుతున్నాయి. పంచాయతీ, పట్టణాలకు వచ్చే నిధులు, ఇతర గ్రాంట్స్ 10 శాతం వరకు హరితహారం, వనమహోత్సవాలకు వెచ్చిస్తున్నారు.


పల్లె, పట్టణ ప్రకృతి వనాల్లోనూ..

- నగర శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో 13 పురపాలక సంఘాలు, 34 గ్రామపంచాయతీలు ఉండగా.. వీటి పరిధిలోని 214 ఎకరాల్లో 102 పల్లె, పట్టణ ప్రకృతి వనాలు (పార్కులు) ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ పథకం కింద నిధులు వెచ్చించి ఎకరానికి 2,500 మొక్కల చొప్పున నాటడం వల్ల చిన్న వృక్షాలుగా అభివృద్ధి చెందాయి. పల్లెలతో పాటు నగరవాసులకు పల్లె, పట్టణ ప్రకృతి వనాలు (పార్కులు) ఎంతో ఆహ్లాదాన్ని ఇస్తుండగా, నిర్వహణలో తలెత్తిన నిర్లక్ష్యం వల్ల పచ్చదనాన్ని కోల్పోయే పరిస్థితికి చేరుకున్నాయి.
- శామీర్‌పేట మండలంలో 10 పల్లె ప్రకృతి వనాలు (పార్కులు) ఉండగా.. ఘట్కేసర్ మండలంలో 18, కీసర మండలంలో తొమ్మిది, మూడు చింతలపల్లి మండలంలో 13, మేడ్చల్ మండలంలో 22 పల్లె ప్రకృతి వనాలు ఉన్నాయి. 13 పురపాలక సంఘాల్లో 21 పట్టణ ప్రకృతి వనాలు ఉన్నాయి. ఈ పార్కుల నిర్వహణ బాధ్యతలను సంబంధిత పురపాలక సంఘాలు, పంచాయతీ, డీఆర్‌డీఏ పర్యవేక్షించాల్సి ఉన్నప్పటికీ, శ్రద్ధను కనబరచడం లేదని స్థానికులు చెబుతున్నారు.
- 5 మండలాల్లోని కాచవానిసింగారం, బొమ్మరాసిపేట్, శ్రీరంగవరం, చీర్యాలలో పదెకరాలోపు ఉన్న ప్రభుత్వ భూముల్లో నాటిన సంపద వనాల నిర్వహణలోనూ ఇదే తంతు కొనసాగుతోంది.

పర్యవేక్షణ కొరవడి...

- మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలో శాఖల మధ్య కొరవడిన సమన్వయంతో మొక్కలకు నీరందడం లేదు. మూడుచింతలపల్లి, ఉద్దమర్రి, కేశవరం, అలియాబాద్, మజీద్‌పూర్, ఏదులాబాద్, కొర్రెముల, రావల్‌కోల్, సోమారం, ఎల్లంపేట, శ్రీరంగవరం, బండమాదారం, తిమ్మాయిపల్లి, కీసర, అంకిరెడ్డిపల్లి, యాద్గార్‌పల్లిల్లో మొక్కలకు నీటి నిర్వహణ లేకపోవడంతో ఎండిపోతున్నాయి.
- 13 పురపాలక సంఘాల్లోని పలు కాలనీల్లో ఇదే పరిస్థితితో మొక్కలు వాడిపోతున్నాయి. జిల్లా అధికార యంత్రాంగంతో సహా డీఆర్‌డీఏ, అటవీ, పంచాయతీశాఖలు, పురపాలక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు మొక్కల సంరక్షణపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

సాక్షి ఎఫెక్ట్.. గుంతల రోడ్లకు మరమ్మతులు



'సాక్షి'లో ప్రచురితమైన కథనం..

దుండిగల్: భౌరంపేట పరిధిలోని వీఎన్‌ఆర్ కళాశాల నుంచి గ్రామంలోని బొడ్రాయి వరకు వచ్చే రహదారి అధ్వానంగా మారింది. 'రోడ్డు ఇలా.. వెళ్లేదెలా..' అన్న కథనాన్ని సోమవారం 'సాక్షి' ప్రచురించింది. దీనిపై స్పందించిన మున్సిపల్ అధికారులు రోడ్డుపై ఉన్న గుంతలను మట్టితో పూడ్చి మరమ్మతులను చేపట్టారు. ఆయా రోడ్డు గుండా వాహనదారులు సాఫీగా వెళ్లేందుకు చర్యలకు ఉపక్రమించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.



జేసీబీతో మరమ్మతులు చేస్తున్న దృశ్యం